స్కెచ్

# దొరకని వరాల తల్లులు

ఉమాదేవి

ఎన్నాళ్లనుంచో అనుకుంటున్నా బెజవాడ వెళ్లాలి వెళ్ళాలి అని. అదేం కర్మమో యీ ఆఫీసు పనిలో తీరదుగదా! ఎప్పుడైనా ఓరోజు శలవు పెట్టుకుని సరదాగా గడుపుదామనుకున్నా మా ఆఫీసరయినా యాథాలాపంగా ఉండి గ్రాంటు చేస్తాడేమోగాని మా శ్రీమతి ఒప్పుకోదు ముందు!

'ఎందుకండీ శలవంతా యిక్కడే అవజేసుకుంటే రేపు మనం మా ఊరు వెళ్తే ఉండటానికి చాలద్దుటండీ' అని బలవంతాన ఆఫీసుకు బయలుదేరదీస్తుంది. ప్రతిసారీ బయలుదేరబోవటం—"ఏముందండీ మహా బెజవాడలో—అత్తగారు అయినా ఉంటే నిత్యే పంలా అక్కడికా వెళ్ళి చూచివద్దుము వాళ్ళు కాస్తా ఏనాడో కళ్ళు మూశారుగదా ముద్దూ ముచ్చటా చూడకుండా..." అని కాస్త దుఃఖం అభినయించి బుడిబుడికన్నీ రొలికించేసరికి నాకూ దుఃఖం ముంచెత్తుకొచ్చి కంఠంరుద్ధమయిపోయి 'వెళ్లొద్దులే దేవీ" అనబుద్ధేసి ఆ ప్రయత్నంనుంచి అపళంగా విరమించుకుంటాను.

తరువాత ఓ గంటకి జ్ఞాపకం వస్తుంది—అమ్మా నాన్నా లేకపోయినా స్వస్థలమనీ పుట్టిపెరిగిన ప్రదేశం చిన్ననాటినుంచీ కలిసిమెలిసి తిరిగిన మిత్రులూ అన్నిటికంటే ఎక్కువైన విషయం మేనమామగూడా అక్కడే ఉన్నారనీను! కర్మకాని యీ కర్నూలులోవచ్చి పడ్డాకూడా నాకు బెజవాడమీద ఉన్న మమకారం సుజాతకెలా అర్థమవుతుంది?

ఆ ఆరండల్ సత్రం పాతబస్‌స్టాండూ బీసెంటు రోడ్డుమీద మేము చేసిన షికార్లూ, సాయంకాలం అన్సారీపార్కు సెంటరులో జరుపుకునే అత్యవసర సమావేశాలూ, దసరాల్లో రామమోహన్ లైబ్రరీలో గానసభలూ కృష్ణవొడ్డు-దుర్గగట్టు ఒకటేమిటి కథలోనయినా "బెజవాడ" అనేపదం కనిపిస్తేచాలు పనికట్టుకుని మొదణ్ణుంచి చివరదాకా చదివిందాకా వదలనుగదా అది ఎంతచచ్చు కథయినా! అలాంటి నా జన్మస్థానం బెజవాడను చూడకుండా యింతకాలం గడపటం దుర్భరం! ఎంతకాలం మా శ్రీమతి జులుం సహించటం? సనేమిరా యీసారి శలవల్లో చచ్చిగీపెట్టినా అత్తగారింటికి వెళ్ళేదిలేదు. కావలిస్తే సుజాతనే వెళ్ళమంటాను. ఎంతకాలంనుంచో మిత్రులు రమ్మంటున్నారు. అసలు నాకూ వెళ్ళాలని ఉంది. అత్తారింట్లో అయితే ఎంతసేపూ మా అత్తగారూ మామగారూ ఒకటే బోర్ కొడుతూ ఉంటారు వాళ్ళ కుటుంబం సంగతులతో. కాస్సేపు నోరు మూసుకుంటారేమో అనుకుంటూ; ఉహూ, వాళ్ళెందుకు ఊరుకుంటారు? అత్తగారి చెల్లెలు కూతురికి పురుడొచ్చిందనో మామగారి తమ్ముడి అల్లుడికి ఉద్యోగమైందనో యిలాంటి వాళ్ళ సొంత విషయాలు మాట్లాడతారు. వాటిలో నా కెందుకు యింటరెస్టుంటుంది?

పోనీ సుజాతయినా మాట్లాడుతుందనా! ఉహూ! అక్కడికి వెళ్ళగానే తనూ వాళ్ళతో చేరి ఊసులాడుతుంది. ఇహ మా నలుగురు అమ్మాయిలూ అమ్మ కొంగుచ్చుకుని పెత్తనాలకు వెళతారుగదా. నేను ఎంతో లోన్లీగా ఫీలవుతాను! అలాంటప్పుడే నాకు మరీ బాధగా ఉంటుంది. ఓ మగపిల్లాడన్నా పుట్టివుంటే వాడన్నా నాతో తిరుగును కదా అని—మా ఆవిడ పంతం పట్టినట్లు ఆడసంతునే కంటోంది. ఆవిడకు స్త్రీజనాభ్యుదయ శాఖాదికారిణి పదవి ఎవరో యివ్వబోతున్నట్లు!

ఈసారి సుజాతను వంటరిగానే ప్రయాణం చేశాను కరీంనగర్...రైల్లో కూచుని, "పిల్లలతో వంటరిగా ఎలా వెళతానో ఏమో! పండగనాటికైనా రండీ-ఎలాగైనా శలవు సంపాదించి..." అంటూ పురమాయిస్తోంది సుజాత.

"ఊహూ. ప్రాణం పోయిమంటూ ఉండలే కనా?" అనుకున్నాను మనసుతో నాలుగోదాన్ని నవ్విస్తూ—పైకి అనేందుకు కలేజాలేక! "మీరు లేకపోతే పండుగలాగే ఉండదండీ" అంది సుజాత బెంగగా. నాకు లోలోపల ఎంతో గర్వం కలిగింది-నాకోసం యిలా నిరీక్షిస్తూ బెంగపడే వ్యక్తి ఉంది కదా అని.

"తప్పకుండా వస్తాను సుజాతా, శలవ దొరకాలి గదా" అన్నాను ఆప్యాయంగా. మరి కాస్సేపటికి రైలు కదిలింది. నావైపు ప్రేమగా చూసే అర్ధాంగి సజలనయనాలూ పిల్లల లేతముఖాలూ దూరమవుతోంటే ఒక్కసారి వాళ్ళమీద ప్రేమ పొర్లుకువచ్చింది. ఎవరికైనా సరే రైలు ఎక్కించటానికి వస్తే రైలు కదలగానే అప్పటిదాకా నిద్రాణమై ఉన్న వారియందలి ప్రేమ ఒక్కసారి ఉబుకుతుంది.

అనుకున్నదానికంటె తేలిగ్గానే శలవు దొరికింది. సుజాతకంటె ముందు బెజవాడ గుర్తొచ్చింది నాకు. మామయ్యా మిత్రులూ కళ్ళలో మెదిలారు. అత్తయ్య తన కూతురు లలితను చేసుకోలేదని యింకా సాధిస్తుందేమో! మామయ్య అలా అనుకోడు ... బెజవాడ టికట్టు కొనుక్కుని రైలెక్కాను. తాడేపల్లి స్టేషనుదాటాక గోడలమీద ఛోట్టి వైద్యం ఎడ్వర్టయిజుమెంటు తాలూకు 'పటమట' అని తాటికాయంత అక్షరాలూ, సీతానగరం, కృష్ణబ్రిడ్జీ, దుర్గగట్టూ చూస్తోంటే హృదయం ఆనందంతో గంతులువేసింది!

బెజవాడ స్టేషను ఎంతగా మారిపోయిందో! సరాసరి గవర్నరుపేటకే మాట్లాడుకున్నాను బండి. మామయ్య నన్ను చూడగానే "ఎన్నాళ్ళకు బెజవాడ జ్ఞాపకం వచ్చిందిరా బుచ్చీ!" అన్నాడు భుజం తడుతూ. నీళ్ళచెంబు గడపలో పెడుతూ "బాగున్నావుటయ్యా బుచ్చిబాబూ" అని అత్తయ్య పరామర్శించింది.

సాయంత్రం సూర్యారావుపేటవైపు బయలుదేరాను. మధ్యాహ్నమే మామయ్య చెప్పాడు... కాకుల్ రావు సూర్యారావుపేటలో బంగళా కట్టించాట్ట వాళ్ళ నాన్న నిలవవేసిన డబ్బుతో... సరాసరి వాళ్ళింటికే వెళ్ళాను...కాలింగ్ బెల్ కు జవాబుగా పనిపిల్ల వచ్చింది బయటికి ఎవరు కావాలంటూ.

"కాకుల్ రావు ఉన్నాడా" అన్నాను.

నన్ను డ్రాయింగురూములోకి నడిపించి కూర్చోమని చెపుతూ ఆ పిల్ల లోపలికి వెళ్ళింది. ఆ గది అలంకరణ, అమరికా అవీ చూచి 'ఓరి వీడి దుంపతెగ ఇంతలోకే ఇంత టేస్టు బలిసిందా వీడికి' అనుకుంటూఉండగానే కాకులరావువచ్చాడు. ఈ ఏడెనిమిదేళ్ళల్లో చాలా మారాడు మనిషి...నున్నగావున్నా ముఖం ఏమిటో పీక్కుపోయింది జబ్బుపడ్డవాడికి మల్లే...దిగులుగా ఏదో ఆలోచిస్తూ మాట్లాడుతున్నాడు. నా ఊహకు అందినంత వరకూ దిగులు పడాల్సిన అవసరాలేవీ వాడికి లేవు మరి.

ఇద్దరం ఒకరిని గురించి ఒకరం ఊపిరి సలపనీయకుండా ప్రశ్నల వర్షం కురిపించుకున్నాం. ఉద్యోగాలు మొదలైన వానిని గురించి చెప్పుకున్నాక పిల్లలలోకి దిగింది సంభాషణ.

"ఏం చెప్పను బ్రదర్—నా బతుకు అధ్వాన్నమైంది" అన్నాడు దైన్యంతో.

చిన్నప్పుడు వీణ్ణి వెర్రివెంగళాయ్ అనేవాళ్ళం. కాస్త — ఎంతోకాదు వేపకాయంత—వెర్రి ఉంది. ముద్దుకి 'కాకీ' అని కూడా అనేవాళ్ళం.

"ఏమిటిరా నీ చింత?" అన్నాను వరాలిచ్చే దేవుడి పోజులో.

"ఏం చెప్పనూ—ముద్దూ ముచ్చటా చూసుకుందామంటే ఒక్క ఆడనలుసు లేదుగదా. అంతా మగపోతులే పుట్టుకొచ్చారు"అన్నాడు దిగులుగా.

హారి పిడుగా యిదా విచారం! పున్నామ నరకనుంచి ఉద్ధరించే కొడుకు పుట్టలేదని మేం తన్నుకుంటోంటే వీడికి ఆడపిల్లలకోసం దిగులా?

"ఏమిటిరా కాకీ? ఆడపిల్లలెందుకూ—యీ కాలంలో కట్నాలిచ్చి పెళ్ళి చేయలేక చస్తోంటే" అన్నాను.

"అలా అనకురా—భోగిపళ్ళు పోసుకున్నా బొమ్మలు పెట్టుకున్నా, పెద్దపండక్కి గోరింటాకు పెట్టుకుని తెల్లారు జామున అన్నాలుతిని ఉయ్యాల లూగినా ఆడపిల్ల అందం ఎలా వస్తుందంటావు? చక్కని పరికిణీలూ, గౌన్లూ,

జుబ్బాలూ తొడుక్కుని నాలుగు నగలూ పెట్టుకుని యింట్లో తిరుగుతుంటే లక్ష్మిలాగా ఉండదూ? యింతకూ మాకాయోగం లేదు" అన్నాడు దీర్ఘంగా నిట్టూరుస్తూ.

నాకు నిజంగా ఎంతో ఆశ్చర్యం వేసింది.

"ఇంతకూ ఎందరు కొడుకులేమిటి నీకు?" అన్నాను.

"ఎందరో లేకేం ఆరుగురు! ఈసారన్నా ఆడపిల్ల పుడుతుందేమోనని ఆశ. అదీ వారం పది రోజుల్లో తేలిపోతుందిలే" అన్నాడు నిరుత్సాహంతో మిళితమైన ఆశతో; లక్షరూపాయల పజిలుకు కట్టి రిజల్టుకోసం ఎదురు చూస్తున్న వాడిలా.

"నీకెందరు పిల్లలు?" అన్నాడు మళ్ళీ.

"నాకు నలుగురూ ఆడపిల్లలే—మగపిల్లాడి కోసం కలవరిస్తున్నాం." అన్నాను జంకుతూ.

"ఎంత అదృష్టవంతుడివిరా" అన్నాడు... ఆవేశంలో నన్ను కావిలించుకున్నంత పనిచేశాడు.

ఇంతలో పనిమనిషివచ్చి కాఫీ ట్రే టీపాయ్ మీద ఉంచి వెళ్ళింది.

"అయితే కాకీ! నీపిల్లల్ని చూపించుమరి ఇంక నేను వెళ్లాలి" అన్నాను.

"రాధా, జానకీ, ఉమా, రజనీ, హేమా" అంటూ పిలిచేసరికి బిలాబిలా వచ్చారు అయిదుగురు పిల్లలూ—పెద్దపిల్లలిద్దరికీ మినహా మిగిలిన ముగ్గురికీ రెండు జడలూ, గౌన్లూ, కళ్ళనిండా కాటుక, మెళ్ళో గొలుసులూ ఆవీను! పిల్లలు చూడబోతే గుమ్మడిపళ్ళలా ఉన్నారు ముద్దొస్తూ! పేరు పెట్టడం ఆడపేరు కలిసేలా పెట్టి ఆడపేర్లతో పిలుస్తున్నారు కాబోలు! వీడి దుంపతెగ! ఎంత వరకు వెళ్ళిందో వీడి పిచ్చి. రాధాకృష్ణుని అడిగాను ఆరోవాడు ఏడని శ్యామలరావు లోపల నిద్రపోతున్నాట్ట—

"ఎలా ఉన్నారు మా పిల్లలు" అన్నాడు దీనంగా. "నిక్షేపంగా బంగారు తండ్రుల్లా ఉన్నారు కానీ ఆ ఆడ వేషాలేమిటిరా కర్మ? పెద్దయినా అలా ఉంచావంటే అలాగే అమ్మాయిల్లా తయారవుతారు. అంతగా మనసుగా ఉంటే మూడో ఏడు వచ్చేదాకా జుట్టుంచినా తరువాతయినా క్రాపు పెట్టించు" అన్నాను.

"పిల్లలే పేచీపెడుతున్నారురా క్రాపుపెట్టించమని. కాని మా సరదా ఎలాతీరను? ఎంత పాటుపడ్డా మగాళ్ళేగా" అన్నాడు నిరుత్సాహంగా.

"మరేం దిగులుపడకురా కాకీ! యీసారి తప్పకుండా కూతురు పుడుతుందిలే" అని ధైర్యంచెప్పి బయలుదేరి యింటికి చక్కావచ్చాను. కూతురు పుట్టినంతగా సంతోషించాడు కాకుల్ రావు నా ఆశీస్సు విని.

ఇంట్లో మామయ్యా వాళ్ళకు యీ సంగతి చెపితే ఒకటే నవ్వు.

మరో నాలుగురోజులు తనివితీరా బెజవాడలో ఉండితిరిగి కర్నూలు వెళ్ళాను. తరువాత పదిహేను రోజులకు మామయ్యదగ్గరనుంచి జాబు వచ్చింది. యీసారీ కాకులరావుకు కొడుకే పుట్టాట్ట! ఈ షాక్‌కి చిన్నప్పటి పిచ్చి తిరగబడితే విశాఖపట్నం హాస్పిటల్‌లో చేర్చటానికి తీసుకువెళ్ళారట! ★

---

# కలహప్రియ రాగం

నీప్రక్కవాడు యిల్లు కట్టుకున్నాడు
నీవుపోయి వాడితో పోట్లాడు
నీయింటి దూలంలో తిరిగే కీటకం
వేయేండ్లకు తక్కువదంటే బూటకం
నీయిల్లు పండించేటంత బూజు
ప్రపంచం మొత్తంలో ఉంటం బేరివాజు
వాడియింటి ఇటిక తయారయి
పదినెల్లకు తక్కువేగా భాయి
వాళింట్లో ఎక్కడైనా దోమల
వాద్యం వినబడదు రేజాముల
నీయింటిలో నల్లుల సంహారం
ఆసియాలోకల్లా విస్తారం
నీకూ వాటికీ మధ్య కో-ఎగ్జిస్టెన్సు
ప్రపంచానికి నేర్పుతుంది కొత్తపేషెన్సు
వాడి ఇంటిపైన రామనామమేలేదు
వాడి యింట్లో రామాయణమే లేదు
వాడి అజ్ఞ లేకుండా వెలుగులూ
ప్రవేశిస్తాయి ముమ్మరంగా గాలులూ
నీ ప్రక్కవాడు ఇల్లు కట్టుకున్నాడు
నీవుపోయి వాడితో పోట్లాడు

— సుప్రసన్న.